**ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్ మార్క్**

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనానికి అరుదైన గుర్తింపు దక్కింది. 1939లో నిర్మించిన ఈ భవనం జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ పొందనుంది. భారత దేశంలో ట్రేడ్ మార్క్ గుర్తింపు ఇప్పటి వరకు ముంబయిలోని తాజ్‌మహల్ హోటల్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనానికి మాత్రమే దక్కింది.



## రోజులు-ప్రాధాన్యం

**డిసెంబర్ 5**
- ఏటా డిసెంబర్ 5న ప్రపంచ మృత్తిక రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'నేలల సంరక్షణ, చర్యలు, పర్యవేక్షణ, నిర్వహణ'. అలాగే అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల రోజుగా కూడా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 4**
- ఏటా డిసెంబర్ 4న బ్యాంకుల అంతర్జాతీయ రోజుగా నిర్వహిస్తారు. ఆర్థిక నిర్వహణ, క్రమశిక్షణలో బ్యాంకులు చేస్తున్న కృషికి నిదర్శనంగా ఈ రోజును జరుపుతారు. అలాగే ఇదే రోజున భారతదేశంలో నావికా దళ దినోత్సవం కూడా ఉంటుంది. ప్రపంచ వన్య ప్రాణి సంరక్షణ రోజుగా కూడా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 3**
- ఏటా డిసెంబర్ 3న దివ్యాంగుల రోజుగా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 2**
- ఏటా డిసెంబర్ 2 బానిసత్వ నిర్మూలన రోజుగా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 1**
- డిసెంబర్ 1న ఎయిడ్స్ డే గా నిర్వహిస్తారు.

**నవంబర్ 30**
- రసాయన యుద్ధ బాధితుల రోజుగా నవంబర్ 30న నిర్వహిస్తారు.

**యూఎన్‌జీఏ**
- పాలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ నిష్క్రమించాలంటూ తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. 1967 నుంచి ఇజ్రాయెల్ ఆక్రమణల నుంచి వైదొలగాలని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

**యూనెస్కో**
- సంప్రదాయ పర్యాటకానికి దేశంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని పారిస్ కేంద్రంగా పనిచేసే యునెస్కో ప్రకటించింది.

**ఈయూ**
- పర్యావరణానికి మేలు కల్పించేలా సాంకేతికతను పెంపొందించేందుకు 4.6 బిలియన్ యూరోలు ఈయూ కేటాయించింది. శూన్య ఉద్గారాల ప్రాజెక్టులతో పాటు ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్లు, పునరుత్పాదక ఇంధన వనరులను ఈ మొత్తంతో రూపొందించనున్నారు.



## అంతర్జాతీయం

**సింగపూర్**



- అగ్ని వారియర్ పేరుతో భారత్, సింగపూర్ నవంబర్ 28 నుంచి 30 వరకు సైనిక విన్యాసాన్ని నిర్వహించాయి. మహారాష్ట్రలోని దేవ్‌లాలి క్షేత్రంలో ఇవి కొనసాగాయి.

**మలేషియా**
- భారత్, మలేషియా డిసెంబర్ 2న హరిమావ్ విన్యాసాన్ని ప్రారంభించాయి. 15వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. మలేషియాలోని బెంటోంగ్ క్యాంప్‌లో ఈ విన్యాసాన్ని చేపడుతున్నారు.




**యూకే**
- భారతదేశంలో అమలవుతున్న 'పీఆర్ఏజీఏటీఐ (ప్రగతి)' అమలు మెరుగ్గా ఉందని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పేర్కొంది. 'ఫ్రం గ్రిడ్‌లాక్ టు గ్రోగ్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. 2015లో ప్రారంభించిన ఈ ప్రగతి కార్యక్రమాన్ని అన్ని దేశాలు ఆదర్శనీయంగా స్వీకరించాలని సూచించింది. దీని పూర్తి రూపం- ప్రో యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్

**దక్షిణ కొరియా**
- దేశ ద్రోహానికి కొందరు పాల్పడుతుండటంతో పాటు ఉత్తర కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అధ్యక్షుడు యూన్ సుక్ మార్షల్ లా విధించారు. అయితే స్వపక్షం, విపక్షాలు, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ఉపసంహరించుకున్నారు.

## వార్తల్లో వ్యక్తులు

**నెటుంబో నంది ఎన్‌దైత్వా**
- నమీబియా దేశానికి అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ దేశంలో ఈ పదవిని చేపట్టనున్న తొలి మహిళ ఆమె.

**దేవేంద్ర ఫడ్నవీస్**
- మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ రాష్ట్రానికి ఆయన ముఖ్యమంత్రి కావడం ఇది మూడోసారి.

**కాశ్ పటేల్**



- అమెరికాలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు భారత సంతతికి చెందిన కాశ్ (కశ్యప్) పటేల్ సారథ్యం వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వచ్చే ఏడాది ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాశ్ పటేల్ కూడా ఎఫ్‌బీఐకి నాయకత్వం వహించనున్నారు.

**బసంత్ గోయెల్**




- యూఎన్ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డ్‌ను భారతదేశానికి చెందిన బసంత్ గోయెల్ గెలుచుకున్నారు. ఆయనకు 'బ్లడ్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనే పేరు కూడా ఉంది. కొవిడ్-19 కట్టడిలో ఆయన కీలక పాత్ర పోషించారు. సింగిల్ క్యాంప్‌లో అత్యధిక మందితో రక్తదానం చేయించడం ద్వారా గిన్నిస్ రికార్డ్‌ను కూడా సృష్టించారు.

**జై షా**
- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు చైర్మన్‌గా జై షా డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించారు.

## తెలంగాణ

**తెలంగాణ తల్లి విగ్రహం**



- రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠించింది. విగ్రహం కుడిచేతిలో తెలంగాణ ప్రజలకు అభయ హస్తం చూపుతూ ఉండగా ఎడమ చేతిలో తెలంగాణలో పండించే ముఖ్యమైన పంటలను ధరించి, గ్రామీణ జీవన విధానం, వ్యవసాయానికి ప్రాధాన్యాన్ని తెలుపుతుంది. వస్త్రధారణలో ఆకుపచ్చని రంగు పచ్చని పంటలను, ఎరుపు రంగు చాకలి ఐలమ్మ లాంటి ధీర వనితల పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి. విగ్రహ పీఠంలో తెలంగాణ తల్లికి దాస్య విముక్తి కల్పించిన ఇక్కడ బిడ్డల పోరాటాలకు ప్రతీకగా బిగిసిన పిడికిళ్లు.

**రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం**
- తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని డిసెంబర్ 6న ప్రారంభించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపం, భారీ వరదలు వంటి ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు అత్యవసర సహాయక చర్యలు చేపడుతారు. అగ్నిమాపక కేంద్రాలను ఇకపై ఎస్‌డీఈఆర్ఎఫ్ స్టేషన్లుగా మారుస్తారు.

**నవోదయ పాఠశాలలు**
- తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏడు నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతిభావంతమైన విద్యార్థులకు ఇది నాణ్యమైన విద్యను అందిస్తుంది. జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటల్లో వీటిని ఏర్పాటు చేస్తారు.

**అంబేద్కర్ వర్సిటీ వీసీగా చక్రపాణి**
- అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నూతన వైస్‌చాన్స్‌లర్‌గా ఆచార్య ఘంటా చక్రపాణి నియమితులయ్యారు. ఇదే విశ్వవిద్యాలయంలో ఆయన సోషియాలజీ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు తొలి చైర్మన్‌గా పని చేశారు.

**పత్తి పరిశోధన కేంద్రాలు**



- రాష్ట్రంలో అఖిల భారత పరిశోధన పథకం కింద రెండు పత్తి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నిర్ణయించింది. వరంగల్‌లో ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

**వైఐఎస్‌యూ, జీహెచ్ఐఏఎల్ ఒప్పందం**
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ రాష్ట్ర యువతకు విమానయాన రంగంలో నైపుణ్యాలను నేర్పుతారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ కూడా ఇస్తారు.

**నార్మ్ డైరెక్టర్‌కు పురస్కారం**
- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ (నార్మ్) డైరెక్టర్ శ్రీనివాసరావుకు రెండు జాతీయ స్థాయి పురస్కారాలు దక్కాయి. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేసినందుకు జాతీయ ఎరువుల సంఘం కోరమండల్ ప్లాంట్ న్యూట్రిషన్ పురస్కారాన్ని, సుస్థిర వ్యవసాయానికి సేంద్రియ, ఖనిజ ఆధారిత ఎరువుల వాడకంపై ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫర్టిలైజర్స్‌లో ప్రచురితమైన వ్యాసానికి ధీరూ మొరార్జీ స్మారక పురస్కారాన్ని ఇచ్చారు.

**విశ్వనాథ్ కార్తికేయ**
- హైదరాబాద్‌కు చెందిన 16 సంవత్సరాల విశ్వనాథ్ కార్తికేయ అంటార్కిటికాలోని అత్యంత ఎత్తయిన శిఖరం విన్సన్‌ను అధిరోహించాడు. అతిచిన్న వయసులో ఈ పర్వతాన్ని అధిరోహించిన భారతీయుడిగా రికార్డ్ సృష్టించాడు.

## క్రీడలు




**జూనియర్ హాకీ ఆసియా కప్**
- పురుషుల హాకీ జూనియర్ ఆసియా కప్‌ను భారత్ గెలుచుకుంది. తుది పోరులో భారత్ పాకిస్థాన్‌ను ఓడించింది. ఫైనల్ మ్యాచ్ మస్కట్‌లో నిర్వహించారు.

**ఈ-ఫుట్‌బాల్**
- ఈ-ఫుట్‌బాల్ ఆసియా క్రీడలను బ్యాంకాక్‌లో నిర్వహించారు. భారత్‌కు చెందిన పవన్ కంపెల్లి కాంస్య పతకాన్ని సాధించాడు.

**సినీ ఉత్సవం**
- కోల్‌కతాలో 30వ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 4న ప్రారంభమైంది. 29 దేశాలకు చెందిన 180 దేశాల చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది సినీ ఉత్సవానికి ఫ్రాన్స్ ఇతివృత్త దేశంగా హాజరైంది.




**పెరిగిన లింగ నిష్పత్తి**
- బేటీ బచావో బేటీ పఢావో పథకం అమలుతో జన్మించినప్పుడు ఉండే లింగ నిష్పత్తి పెరిగిందని కేంద్రం ప్రకటించింది. 2014-15లో ఈ లింగ నిష్పత్తి 918 ఉండగా, 2023-24లో 930కి చేరింది.

## జాతీయం

**జోనల్ సాంస్కృతిక కేంద్రాలు**
- ఏడు సాంస్కృతిక కేంద్రాలను ఏర్పాటు చేస్తూ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. వివిధ దేశాల మధ్య సంబంధాల పెంపునకు ఉద్దేశించింది ఇది. ఒక్కో ప్రాంతానికి ఒక్కో కేంద్రం ఎంపికయ్యాయి. అవి..

**దక్షిణజోన్- తంజావూర్**
దక్షిణ మధ్య జోన్- నాగపూర్
పశ్చిమ జోన్- ఉదయ్‌పూర్
ఉత్తరమధ్య జోన్- ప్రయాగ్ రాజ్
తూర్పు జోన్- కోల్‌కతా
ఈశాన్య జోన్- దిమాపూర్

**పాముకాటు**
- పాముకాటును నోటిఫయబుల్ డిసీజ్‌గా కేంద్రం ప్రకటించింది. ఈ తరహా నిర్ణయం గతంలో తమిళనాడు రాష్ట్రం కూడా తీసుకుంది. పాముకాటుతో రోగులు వచ్చినప్పుడు సమాచారాన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు తెలపాలి. ఫలితంగా ఎక్కువ కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ఔషధాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఇతర చర్యలు కూడా తీసుకుంటారు.

**ఓఈసీడీ**
- 2024-25లో భారత్ 6.8% వృద్ధి సాధిస్తుందని ఫ్రాన్స్‌లోని పారిస్ కేంద్రంగా పనిచేసే ఓఈసీడీ అంచనా వేసింది. గతంలో వృద్ధి రేటు అంచనా 6.7% మాత్రమే ఉంది. భారత్ ఆర్థికంగా మెరుగ్గా ఉందంటూ తాజాగా పేర్కొంది.

**మహా కుంభమేళ జిల్లా**
- 2025లో మహా కుంభమేళ జరగనుంది. ఈ నేపథ్యంలో సమీప ప్రాంతాన్ని 'మహా కుంభమేళ జిల్లా'గా ఏర్పాటు చేస్తూ ఉత్తర



ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 76కు చేరింది.

**ఆధార సంవత్సరం**
- ఆధార సంవత్సరాన్ని 2022-23కు మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 2011-12 ఆధార సంవత్సరంగా ఉంది. 26 మందితో కూడిన కమిటీ సూచన మేరకు కేంద్రం ఆధార సంవత్సరాన్ని మార్చింది. ఈ కమిటీకి బిశ్వనాథ్ నేతృత్వం వహించారు.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411


